నేడు హంపి నుంచి బెంగళూరుకు బైక్ ర్యాలీ

హోస్పేట, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రజాస్వామ్య వేడుకల సందర్భంగా హంపి విజయవిఠల ఆలయం నుంచి బెంగళూరుకు బైక్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 7గంటలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ ర్యాలీని ప్రారంభిస్తారు. కమలాపూర్, విరూపాక్షేశ్వరాలయం, కడ్డిరాంపుర, మలపనగుడి, కనకదాస అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఆఫీస్ సర్కిల్, అండేడ్కర్ సర్కిల్, వీఎన్‌సీ కాలేజ్, సాయిబాబా సర్కిల్, గురువాక్ కళాశాల, బెంగళూరు జాతీయ రహదారి మీదుగా ర్యాలీ సాగనుంది.

విద్యతోనే ఆత్మాభిమానం: సీఎం



జేఎస్ఎస్ మఠంలో ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): విద్యతోనే జ్ఞానం వికసిస్తుందని, స్వతంత్ర ఆలోచనలు, ఆత్మాభిమానం బాధ్యతాయుతమైన వ్యక్తిత్వం సాధ్యమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. మైసూరులోని జేఎస్ఎస్ విద్యాసంస్థల ప్రాంగణంలో శివరాత్రి అనుభవమంటపం, కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జేఎస్ఎస్ పూర్వవిద్యార్థులు, గృహ నిర్మాణ సంఘాన్ని ప్రారంభించి ఇంటిస్థలాలు కేటాయించడం సంతోషకరమన్నారు. సహకారసంఘాలు చరిత్రలోనే తొలిసారి అనేలా కొనుగోలు చేసిన భూమిధరకే ఇంటిస్థలాలు ఇచ్చారన్నారు. శివరాత్రి రాజేంద్ర మఠం విద్యారంగానికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. మహిళలకు విద్యలో హక్కు కావాలని ప్రతిపాదించింది బసవణ్ణకాలంలోనే సాధ్యమైందన్నారు. శివరాత్రి దేశికేంద్రస్వామిజీ, మంత్రులు మహదేవప్ప, వెంకటేశ్, గ్యారెంటీ పథకాల కమిటీ ఉపాధ్యక్షురాలు పుష్పఅమరనాథ్ తదితరులు పాల్గొన్నారు

సీఐ సహా 11మందిపై వేటు

- డ్రగ్ పెడ్లర్లతో పార్టీలో పాల్గొన్నారని ఆరోపణలు
- సస్పెండ్ చేస్తూ డీసీపీ గిరీశ్ ఉత్తర్వులు

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డ్రగ్‌పెడ్లర్‌లతో కలసి పార్టీలో పాల్గొన్న ఆరోపణలతో చామరాజపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సహా 11మందిని సస్పెండ్ చేస్తూ డీసీపీ గిరీశ్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్‌పెడ్లర్స్‌తో కలసి ఇటీవల చామరాజపేట, జేజేనగర్‌కు చెందిన పోలీసులు ఓ పార్టీలో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించి సమాచారం తెలియడంతో నగర పోలీస్ కమిషనర్ సమగ్రంగా విచారించాలని ఆదేశించారు. చామరాజపేట పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏడుగురు, జేజేనగర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన నలుగురిని సస్పెండ్ చేస్తూ డీసీపీ గిరీశ్ ఆదేశాలు జారీచేశారు. వారిలో సీఐతోపాటు కానిస్టేబుళ్లు రమేశ్ శివరాజ్, మధుసూదన్, ప్రసన్న, శంకర్, ఆనంద్‌తోపాటు జేజేనగర్ ఏఎస్ఐ కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్, బసవగౌడ తదితరులు ఉన్నారు. పోలీసులపై వేటుపడడం చర్చనీయాంశంగా మారింది.





దూసుకొచ్చిన మృత్యువు

- కన్నీరు మిగిల్చిన కంటెయినర్
- హాసన్ ప్రమాదంలో 9కి చేరిన మృతుల సంఖ్య
- ప్రధాని మోదీ సంతాపం.. పీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2 లక్షల పరిహారం
- బాధితులను పరామర్శించిన మాజీ ప్రధాని దేవెగౌడ.. రూ.లక్ష సాయం



భక్తుల మీదికి దూసుకొచ్చిన కంటెయినర్





ప్రవీణ్ (ఫైల్)

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గణేశ నిమజ్జనోత్సవంలో కంటెయినర్ దూసుకెళ్లిన ఘటనలో మృతులసంఖ్య 9కి పెరిగింది. హాసన్ జిల్లా మొసళె హొసహళ్ళిలో శుక్రవారం రాత్రి వినాయకుడి శోభాయాత్రలో కంటెయినర్ ఆకస్మికంగా దూసుకెళ్లిన ప్రమాదంలో ముగ్గురు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉన్నారు. మృతులు ప్రవీణ్‌కుమార్ (21), బీఈ ఫైనలియర్ విద్యార్థి, బళ్ళారి. గోకుల (17), ముత్తిగె హిరేహళ్ళి, హొళెనరసీపుర తాలూకా, రాజేశ్ (17), కే.బీ.పాళ్య, హళెకోటె హోబళి, హొళెనరసీపుర తాలూకా, ఈశ్వర (17), దనాయకనహళ్ళి కొప్పలు, హొళెనరసీపుర తాలూకా, మిథున్ (22), గవిగంగాపుర గ్రామం, హొసదుర్గ తాలూకా చిత్రదుర్గ జిల్లా, సురేశ్ (23) బీఈ విద్యార్థి మణెనహళ్ళి మర్లె గ్రామం, చిక్కమగళూరు జిల్లా వాసిగా గుర్తించారు. ఇక హొళె నరసీపుర తాలూకా హళెకోట హోబళి కబ్బినహళ్ళికి చెందిన కుమార (25), ప్రవీణ (25) ఉన్నారు. మరో వ్యక్తి హాసన్ తాలూకా బంటరహళ్ళి ప్రభాకర్ (55)గా గుర్తించారు. ఆరుగురు స్థానికులు కాగా ముగ్గురు చిక్కమగళూరు, బళ్ళారి, చిత్రదుర్గ జిల్లాలకు చెందినవారు. కొందరి మృతదేహాలను హిమ్స్ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించనున్నారు. ప్రమాదానికి క్యాంటర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని దక్షిణ వలయ ఐజీపీ బోరలింగయ్య తెలిపారు.

కంటెయినర్ డ్రైవర్‌పై కేసు నమోదు

ప్రమాదానికి సంబంధించి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కృష్ణబైరేగౌడ స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కంటైనర్ డ్రైవర్ భువన్‌పై గోరూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మృతులకు తలా రూ.5లక్షలు, గాయపడినవారికి తలా రూ.50వేలు పరిహారం ప్రభుత్వం ప్రకటించిందన్నారు. స్థానికంగా అత్యవసర చర్యలకోసం కేఎస్ఆర్‌పీ బలగాలను కేటాయించినట్లు తెలిపారు. శనివారం హిమ్స్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నవారిని పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్సలు ఇవ్వాలని, ప్రభుత్వమే మొత్తం ఖర్చు భరించనుందని వైద్యులకు సూచించారు.

ప్రధాని మోదీ సంతాపం

గణేశ శోభాయాత్రలో చోటు చేసుకున్న ప్రమాదంపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సంతాపం తెలిపారు. పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద మృతులకు తలా రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున ప్రకటించారు. ఈమేరకు శనివారం 'ఎక్స్' ద్వారా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



హిమ్స్‌లో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి కృష్ణబైరే గౌడ

నా తల్లి సొంతూరు.. బాధతోనే వచ్చా

- బాధితులను పరామర్శించిన మాజీ ప్రధాని దేవెగౌడ

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాల ఊరేగింపులో కంటెయినర్ ఢీ కొన్న ఘోర ప్రమాదం జరిగిన మొసళె హొసహళ్ళి గ్రామం తన తల్లి సొంతూరని, ప్రమాద విషయం తెలిసి బాధ కలిగిందని అందుకే వచ్చానని మాజీ ప్రధాని దేవెగౌడ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హాసన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన తల్లి సొంతూరని, అక్కడే తన బాల్యం గడిచిందని, ఆ గ్రామంలో ఘోర ప్రమాదం తీవ్రంగా మనసును నొప్పించిందని అన్నారు. ఉన్నతమైన వైద్య చికిత్సలు అందించాలని డాక్టర్లకు సూచించానన్నారు. జేడీఎస్ పార్టీ నుంచి మృతులకు లక్ష రూపాయల పరిహారాన్ని ప్రకటించారు. గాయపడ్డవారికి రూ.15-25వేల దాకా అందిస్తామన్నారు.



ఆసుపత్రిలోకి వెళ్తున్న దేవెగౌడ

చదువు కోసం వెళ్లి శవమై వస్తివే బిడ్డా..

- మృతుల్లో బళ్లారి విద్యార్థి
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



ప్రవీణ్‌కు నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీరాములు, రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బళ్లారి/బళ్లారి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమ్మా నేను బాగున్నాను. మీరు కూడా బాగున్నారు కదా అని ఫోన్ చేసి అడిగితివి.. వినాయక నిమజ్జనానికి ఫ్రెండ్స్‌తో వెళ్తున్నారు.. అన్నావు..ఇలా శవమై తిరిగి వచ్చావా.. ఆ దేవుడు ఇంత అన్యాయం చేస్తాడా అంటూ ప్రవీణ్ తల్లి సుశీలమ్మ గుండెలు బాదుకున్నారు. హసన్ లో శుక్రవారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనం వద్ద కంటెయినర్ ఢీ కొన్న ప్రమాదంలో బళ్లారికి చెందిన ప్రవీణ్ కుమార్ మృత్యువాత పడ్డాడు. ప్రవీణ్ బళ్లారిలో ఐటీఐ చదివి బీ-టెక్ చదివేందుకు హసన్ వెళ్లాడు. అతని తల్లి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తోంది. బీ-టెక్‌లో సెమ్ ఎగ్జామ్స్ అయిపోయాయి..రెండు రోజుల్లో ఇంటికి వస్తానని ప్రవీణ్ ఫోన్ చేశాడు. ఇలా విగతజీవిగా రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఫైనల్ ఇయర్ చదువుతున్న ప్రవీణ్‌కు ఇటీవలే పరీక్షలు ముగిశాయి. ఇంటికొచ్చేముందే ఇలా జరగడంతో కుటుంబంలో విషాదం నింపింది. మాజీ మంత్రి బి. శ్రీరాములు ప్రవీణ్ తల్లిదండ్రులను ఓదార్చి పరామర్శించారు. బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే మాజీ మంత్రి నాగేంద్ర రూ.లక్ష అందిస్తామని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

కెనరా బ్యాంకు వెబ్‌సైట్ మరింత సురక్షితం

బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ కెనరా బ్యాంకు వెబ్‌సైట్ మరింత సురక్షితంఅయ్యేలా చర్యలు చేపట్టినట్టు నగరంలో శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌బీఐ సూచనలకు అనుగుణంగా వెబ్‌సైట్‌ను https://canara-bank. bank.in అడ్వాన్స్‌డ్ ఫీచర్స్‌తో ఐపీవీ6, డీఎన్ఎస్ఎస్ ఈసీలతో సురక్షితం చేశామన్నారు. వినియోగదారుల డిజిటల్ బ్యాంకింగ్ విధానాలకు మెరుగైన భద్రత సాధ్యమన్నారు. సైబర్ మోసాలైన ఫిషింగ్, స్పూఫింగ్, డొమైన్ హైజాకింగ్ వంటి వాటి బారినుంచి కాపాడేందుకు వెబ్‌సైట్‌ను ఆధునీకరించామన్నారు. తద్వారా వినియోగదారులు నిజమైన బ్యాంకింగ్ వెబ్‌సైట్స్‌ను గుర్తించేందుకు వీలు కానుందన్నారు.

ప్రేమించలేదని యువతిపై దాడి

- చికిత్స పొందుతూ మృతి.. నిందితుడి ఆత్మహత్య

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పెళ్లికి నిరాకరించిందని దాడి చేసిన ఘటనలో యువతి మృతి చెందింది. యువకుడు పారిపోయాడని భావించి పోలీసులు గాలింపు చేపట్టగా చివరకు అతడి మృతదేహం సమీపంలోని బావిలో లభ్యమైంది. ఉడుపి జిల్లా బ్రహ్మావర తాలూకా కొక్కర్ణె గ్రామంలో శుక్రవారం ఉదయం రక్షితా (24)పై కార్తీక్ (27)చాకుతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు పరుగున వచ్చారు. తీవ్రంగా గాయపడిన ఆమెను మణిపాల్ కస్తూర్బా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించక ఆమె శనివారం మృతిచెందారు. దాడి ఘటనపై బ్రహ్మావర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. దాడి తర్వాత కార్తీక్ పారిపోయి ఉంటాడని అందరూ భావించారు. యువతి తల్లి ఫిర్యాదుతో పోలీసులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. చివరకు శనివారం అతడి మృతదేహం సమీపంలోని ఓ బావిలో లభించింది. ఉడుపి జిల్లా ఎస్పీ హరిరామ్ శంకర్ మాట్లాడుతూ యువతి పుట్టినరోజు అని, యువకుడు బైక్‌పై వచ్చి అడ్డుకుని ఒక్కసారిగా చాకుతో గాయపరిచినట్లు తెలుస్తోందన్నారు. యువకుడి ఫోన్ నంబరు యువతి బ్లాక్ చేసిందనే కోపంతోనే యువకుడు దాడికి పాల్పడ్డాడన్నారు. కాగా యువతి పుట్టినరోజునాడే దాడి చేయడం, చికిత్స ఫలించక మృతి చెందడం, యువకుడు సైతం ఆత్మహత్యకు పాల్పడడం ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది.

యునెస్కోకు దూరంగా కల్లిన కోట

- ఆక్రమణలతో దక్కని అవకాశం : చరిత్రకారుల ఆవేదన



కోటపై ఉన్న జైలు వరకు విస్తరించిన కట్టడాలు


బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే చారిత్రకమైన నిర్మాణం చిత్రదుర్గ కోట. నేతల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత కారణంగా యునెస్కోలో స్థానం దక్కకుండా పోతోంది. దీనిని చాళుక్యులు నిర్మించగా 15వ శతాబ్దం నుంచి 18వ శతాబ్దం మధ్య చిత్రదుర్గ నాయకులు(పాలేగాళ్ళు) మరింత విస్తరించారు. శత్రువులను అడ్డుకోవడంలో ఈ కోట దుర్భేద్యమైనదిగా పిలుస్తారు. ఒనకు ఓబవ్వ వీరత్వం ఈ కోటకు సంబంధించిన ఓ అద్భుతమైన కథ.. 1779లో హైదర్ అలీ, తరువాత అతని కుమారుడు టిప్పు సుల్తాన్ పాలన అనంతరం బ్రిటీషులు కోటను స్వాధీనం చేసుకున్నారు.

అన్ని అర్హతలున్నా దూరం


వివిధ రాజకుటుంబాలు, నాయక రాజుల వీర విహారాలకు ప్రతీకగా నిలిచిన చిత్రదుర్గ రాతి కోట 'యునెస్కో' ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేరడానికి అన్ని అర్హతలు ఉన్నాయి. అయితే స్థానిక ప్రజా ప్రతినిధుల ఇచ్ఛాశక్తి కొరవడిన కారణంగా అద్భుతమైన కట్టడం మరుగున పడిపోయేలా ఉంది. దీనికి ప్రధాన కారణం కోట చుట్టూ ఆక్రమణలు, అనధికార భవనాలు విస్తరణ, మౌలిక సదుపాయాల కొరత కారణాల చేత 'యునెస్కో' గుర్తింపునకు దూరమై పోతోందని చరిత్ర కారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రామాయణం, మహాభారతం, పురాతన శిలాయుగం, క్రీస్తు పూర్వ, క్రీస్తు శకం 1వ శతాబ్దం నుంచి చరిత్ర పుటల్లో దుర్గాదేవి చరిత్ర మనోహరంగా ఉంది. వరుస రాజవంశాలు వదిలి పెట్టిన స్మారక చిహ్నాలు అవశేషాలు ఇప్పటికీ సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. సుందరమైన రాళ్ళు చరిత్ర సారాన్ని చాటుతున్నాయి. ఇటీవల యునెస్కో కమిటీలో పని చేసే ఒక అధికారి తన కుటుంబంతో లండన్ నుండి కోట చూడడానికి వచ్చారు. ఏడు వలయాల కోట అవశేషాల చూసి ఆయన ఆశ్చర్యపోయారు. కాని కోటకు నేరుగా దారి లేకపోవడం, కోట సమీపంలో అనధికార భవనాలు ఉండడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలను తొలగించే వరకు రాతి కోటను ప్రపంచవారసత్వ జాబితాలో చేర్చలేమని అభిప్రాయపడ్డారు.

అక్రమ కట్టడాలపై నిర్లక్ష్యం

భారతీయ పురాతత్వ చట్టం, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం స్మారకాలకు 300 మీటర్ల దూరంలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు, జనవసతి ప్రదేశాలు ఉండరాదని ఆదేశాల్లో ఉన్నా... ప్రస్తుతం చిత్రదుర్గంలో రాతి కోట చుట్టూ ఆనుకుని జనవసతి ప్రదేశాలు, శిక్షణసంస్థలు, వాణిజ్య దుకాణలు, రెస్టోరెంట్లు వెలియడం గమనార్హం. బురుజున హట్టినుండి చిక్కపేట వరకు చారిత్రాత్మకమైన జైలు నుంచి కూతవేటు దూరంలో నివాస గృహాలు వెలిశాయి. అక్రమకట్టడాలు తీగల్లో పాకుతుండడాన్ని ఏఎస్ఐ అడ్డుకట్ట వేయలేక పోతోంది. 3వ రౌండ్ కోట నుండి కోటగోడ చుట్టూ ఏఎస్ఐ ఫెన్సింగ్ వేసుకున్న ప్రాంతాన్ని మాత్రమే తమ వ్యాప్తిలోకి వస్తుందని, మిగలిన స్మారకాలకు తమకు సంబంధం లేదన్నట్లుగా పేర్కొనడం విడ్డూరంగా ఉంది. దీనికి తోడు రాష్ట్ర పురాతత్వ శాఖ కూడా చిత్రదుర్గలో ఉన్న స్మారకాల రక్షణకు ముందుకు రావడం లేదు. అక్రమ కట్టడాలు తొలగించితే రాతికోటగోడ యునెస్కో జాబితాలో చేర్చేందుకు లభిస్తుందని యువ చారిత్రక పరిశోధకులు ప్రొఫెసర్ ఎస్.మహంతేష్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చిత్రదుర్గకు ప్రతీకగా ఉన్న ఏడు చుట్లు రాతికోటగోడ సంక్షించుకోవడం మన బాధ్యతని, యునెస్కో జాబితాలోను చారిత్రక చిత్రదుర్గ కోటను చేర్చేందుకు అవసరమైన సమావేశాలు జరుపుతున్నట్లు చిత్రదుర్గ జిల్లాధికారి వెంకటేష్ తెలిపారు.



కోట లోపల సుందరమైన కట్టడాలు



రాతికోటగోడలోకి ప్రవేశించే మార్గం

యునెస్కో గుర్తింపుతో లాభాలెన్నో..

యునెస్కో(ఐక్యరాజ్య సమితి విద్య, శాస్త్రీయ మరియు సాంస్కృతిక సంస్థ) ప్రపంచలోని అత్యంత అందమైన చారిత్రక సహజప్రదేశాలను వారసత్వ ప్రదేశాలుగా ప్రకటిస్తుంది. ఇందులో నమోదు అయితే ఎన్నో లాభాలుంటాయి. స్మారక చిహ్నాల అభివృద్ధికి పూర్తి బాధ్యత తనే తీసుకుంటుంది. భారీ మొత్తంలోఆర్థిక సహాయం అందజేస్తుంది. ఇప్పటి వరకు దేశంలోని 44 పర్యాటక ప్రాంతాలను ప్రపంచవారసత్వ ప్రదేశాలుగా గుర్తించారు హంపి, పట్టదకల్లు, హొయసల దేవాలయాలు, పశ్చిమ కనుమలు రాష్ట్రంలో వారసత్వ ప్రదేశాలుగా గుర్తించారు.

సంస్థాగత బలం కరువు..

యునెస్కో జాబితాలో చేర్చడానికి ముందుగా ప్రజాభిప్రాయాన్ని సేకరించాల్సి ఉంటుంది. అయితే ప్రజాభిప్రాయాన్ని బలంగా ప్రభుత్వం ముందు తీసుకెళ్ళడంలో సరైన సంఘ సంస్థ లేకపోవడం విచారించదగ్గ విషయం. చారిత్రక కట్టడాలపై ఆసక్తి చూడం లేదనే ఆరోపణలు నగరంలో వినిపిస్తున్నాయి. చిత్రదుర్గ నగరానికి వచ్చే పర్యాటకులు కోట ప్రదేశానికి వెళ్ళడానికి ప్రయాస పడాల్సి వస్తుంది. పాత జాతీయ రహదారి నుంచి నేరుగా కోట ప్రాంతానికి చేరుకునే రహదారి నిర్మాణం కాస్త నిలిచి పోయింది. వీటిపై యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది.

క్రైం కార్నర్

అలా కొట్టేసి.. ఇలా చిక్కేశాడు..!

● సినిమా థియేటర్‌లో చోరీ ● అక్కడ పనిచేసే వ్యక్తే నిందితుడు
● పట్టించిన సీసీ టీవీ ఫుటేజీ

కొత్తచెరువు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పుట్టపర్తి రహదారి పక్కనున్న సందీప్ థియేటర్‌లో ఇంటి దొంగ చేతివాటం ప్రదర్శించాడు. రూ.50 వేలు అలా కొట్టేసి.. ఇలా దొరికిపోయాడు. సీసీ టీవీ ఫుటేజీలో చోరీ వ్యవహారం స్పష్టంగా తెలిసిపోయింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. థియేటర్‌లో రెండు రోజుల సినిమా ప్రదర్శన డబ్బు రూ.50వేలు బీరువాలోనే ఉంచి, మేనేజర్ తాళం వేశారు. పక్కనే తన గదిలోకి వెళ్లి శుక్రవారం రాత్రి నిద్రించాడు. ఆ డబ్బుపై థియేటర్‌లోనే పనిచేస్తున్న బోయ ధనుష్ కన్నేశాడు. శనివారం తెల్లవారుజామున ముఖానికి మాస్క్ పెట్టుకుని, మేనేజర్ గదికి బయట గొళ్లెం పెట్టాడు. ఇనుప రాడ్డుతో బీరువా పగులగొట్టి, అందులోని రూ.50వేల నగదు అపహరించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఆ డబ్బు థియేటర్ ఆవరణలోనే ఉన్న ఆటోలో ఉంచి, అద్దెకు ఉంటున్న గదికెళ్లి నిద్రించాడు. శనివారం ఉదయం మేనేజర్ లేచి తన గదికి గొళ్లెం పెట్టి ఉండటంతో మరొకరికి ఫోన్ చేసి, తెరవమని చెప్పాడు. అతడు వచ్చి మేనేజర్ గది తెరిచారు. తరువాత బీరువా ఉన్న గదిని పరిశీలించగా తలుపులు తెరిచి ఉండటంతో చోరీ అయినట్లు గ్రహించి థియేటర్ యజమాని లక్ష్మీనారాయణకు తెలిపారు. ఆయన వచ్చి థియేటర్‌లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ధనుష్ చోరీ చేయడం, ఆ డబ్బు ఆటోలోనే ఉంచిన వ్యవహారం మొత్తం తెలిసిపోయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు థియేటర్‌ను పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. ఆటోలో ఉంచిన రూ.50వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-బళ్లారి రైలు మార్గంలో బెవినహల్ రైల్వేస్టేషన్ సమీపాన శుక్రవారం రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయసు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9866144616 నంబరులో సంప్రదించాలన్నారు. వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి మత్తు

రాయలచెరువులో యథేచ్ఛగా సేవిస్తున్న యువత

యాడికి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో యువకులు గంజాయి మత్తులో తూలుతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఒక ధాబాను, ఆ పక్కనే ఉన్న అరటి తోటను ఇందుకు ఆవాసంగా మార్చుకున్నట్లు చెబుతున్నారు. బెంగళూరు నుంచి గంజాయి పౌడర్ ఇక్కడకు సరఫరా అవుతోందనీ, దానిని సిగరెట్లలో నింపుకుని, తాగుతున్నారని సమాచారం. లారీ డ్రైవర్ల ద్వారా కూడా గంజాయి సరఫరా అవుతున్నట్లు చర్చించుకుంటున్నారు. యువకులు ఎక్కువగా దీనికి బానిసలుగా మారుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ధాబా వద్ద, పక్కనే అరటితోటలో యువకులు గుంపులుగా తిష్టవేసి గంజాయి సేవిస్తున్నారని సమాచారం. గంజాయి మత్తులో యువకులు ఎటువంటి ఆగడాలకు పాల్పడుతారోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. రాయలచెరువు పారిశ్రామిక ప్రాంతం కావడంతో గంజాయి కల్చర్ ఎక్కువ అవుతోందని వారు వాపోతున్నారు. రాయలచెరువు నుంచి చందనకు వెళ్లే రోడ్డులోని ఓ ఆలయ పరిసరాల్లో కూడా యువకులు గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో...' అంటూ ప్రచారం చేపట్టిన అధికారులు గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇద్దరు విద్యార్థులు అదృశ్యం


భరత్ రాజ్, లోకేష్

రాప్తాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రసన్నాయపల్లి సమీపంలోని ఎల్ఆర్‌జీ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. వారి తల్లి తండ్రులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. 8వ తరగతి విద్యార్థులు భరత్ రాజ్, లోకేష్ శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లారు. ఉదయం 9 గంటల సమయంలో పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న తల్లితండ్రులు అన్నిచోట్లా గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో రాప్తాడు సీఐ హర్షకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల ఆచూకీ కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

లాటరీ టిక్కెట్ విక్రేతల అరెస్టు

కదిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిషేధిత లాటరీ టిక్కెట్లు, నాటుసారా అమ్ముతున్న ఐదుగురిని శనివారం అరెస్టు చేశామని పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. పక్కా సమాచారంతో కుటాగుళ్ల రైల్వే గేటు సమీపంలో ఎస్ఐ బాబ్‌జాన్ దాడులు చేశారని, నాటుసారా, లాటరీ టిక్కెట్లు అమ్ముతున్న ముఠా పారిపోతుండగా ఐదుగురిని పట్టుకున్నారని సీఐ తెలిపారు. పోలీసుల దాడుల గురించి తెలుసుకుని, మరో ఆరుగురు అక్కడికి రాకుండా పారిపోయారని తెలిపారు. పట్టుబడిన వారిలో జయప్రకాష్ బాబు, బాబా ఫకృద్దీన్. శిలార్ బాషా, నవీన్ కుమార్, మహమ్మద్ అలి ఉన్నారు. వీరంతా కదిరి పట్టణవాసులు. నిందితుల నుంచి 5 సెల్ ఫోన్‌లు, 16 లీటర్ల నాటుసారా, 47 లాటరీ టిక్కెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి, న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పారిపోయిన వారిపైనా కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసుకునేందుకు తీసుకెళ్లిన ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశామని టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ శనివారం తెలిపారు. ఆత్మకూరు మండలం గొరిదిండ్లకు చెందిన పోతులయ్య ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడని సీఐ తెలిపారు. అనంతపురంలోని కేఎస్ఆర్ కాలేజీ ఇంటర్ చదువుతున్న విద్యార్థిని పెళ్లి చేసుకునేందుకు ఈ నెల 11న ధర్మవరం తీసుకెళ్లాడని తెలిపారు. విద్యార్థిని మైనర్ అని, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

రైతులకు ఉపయోగపడే పనుల్లో ముందుంటాం: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు ఉపయోపడే పనులు చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో మండలంలోని వెస్టునరసాపురం, నాగులగుడ్డతండా రైతులు వర్షం నీరు వృథాకాకుండా చెక్‌డ్యాంలు నిర్మించాలని తన దృష్టికి తీసుకొచ్చారని, తాను ఎమ్మెల్యే అవగానే ఆ గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం కింద చెక్‌డ్యాంలు మంజూరు చేయించి నిర్మింపజేశామని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ చెక్ డ్యాంలు నిండి నిండుకుండలా ఉన్నాయన్నారు. వాటి వల్ల వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. చెక్‌డ్యాంలు నిండడంతో రైతులు తనకు ఫోన్ చేసి హర్షం వ్యక్తం చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాలకు మరిన్ని నీటిపథకాలను తీసుకుని వస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చెన్నేకొత్తపల్లికి చెందిన పవనకుమార్‌రెడ్డి బైక్‌లో గ్రామంలోకి వస్తున్నాడు. జాతీయ రహదారి జంక్షన్ వద్దకు రాగానే బెంగళూరు నుంచి అనంతపురం వైపునకు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే దగ్గర్లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రత్యామ్నాయం అందేనా..?

● జిల్లాకు 15 వేల క్వింటాళ్లతో ప్రతిపాదనలు
● నేటికీ సరఫరాకాని ప్రత్యామ్నాయ విత్తనాలు
● ముగింపు దశకు ఖరీఫ్
● బయట కొనుగోలు చేస్తున్న రైతులు


ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం చేసుకున్న భూమి

మడకశిర, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ఊసేలేకుండా పోయింది. ఆ ఊసే వినిపించట్లేదు. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్నా.. విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పొలాలను సిద్ధం చేసుకుని, ఎదురుచూస్తున్నారు. జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆ తరువాతి ప్రక్రియే మొదలుకాలేదు. ఏటా ఆగస్టు మొదటి వారంలోనే పంపిణీ చేసేవారు. ఈ సారి సెప్టెంబరు సగం నెల గడుస్తున్నా.. ఆ ఊసేలేకపోవడంతో అన్నదాతలు ఆశలు వదులుకుంటున్నారు. కొందరు బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేసి, పంట పెడుతున్నారు. ఇంకొందరు ఇంకా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. రైతన్నలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. అధికారులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపినా సరఫరాలో జాప్యం చేస్తున్నారు. భూములను సిద్ధం చేసుకున్న రైతులు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట వేయాలని భావిస్తున్నారు. విత్తనాలు సరఫరా చేయకపోవడంతో నిరాశ చెందుతున్నారు. జిల్లాలో 60 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 15వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపారు. నేటికీ పంపిణీ చేయలేదు.

విత్తనాలు ఇవ్వకపోతే బీడుగా వదిలేస్తా



ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుందామని రెండెకరాల పొలాన్ని సిద్ధం చేసుకున్నా. వర్షాభావం కారణంగా వేరుశనగ పంట పెట్టలేకపోయా. ప్రత్యామ్నాయ విత్తనాలు నేటికీ అందించలేదు. వారం రోజులు దాటితే ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు వస్తుంది. ఇప్పటికైనా అధికారులు విత్తనాలు పంపిణీ చేయాలి. లేకపోతే పొలాన్ని బీడుగా వదిలాల్సి వస్తుంది.

-నరసింహప్ప, రైతు, కాలువపల్లి

ప్రతిపాదనలు పంపాం

మడకశిర నియోజకర్గంలో 11వేల హెక్టార్ల లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 4,500 క్వింటాళ్ల ఉలవలు, పెసలు, అలసంద, జొన్న విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపాం. సరఫరా అయిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం.

-తిమ్మప్ప, వ్యవసాయఅధికారి

క్రీడాభివృద్ధిలో రాజీ ప్రసక్తే లేదు

● ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్
● రాయలసీమ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధిలో రాజీపడే ప్రసక్తే లేదని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ పేర్కొన్నారు. అనంత క్రీడాగ్రామంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌ను భారత మహిళా క్రికెట్ జట్టు ప్లేయర్ అనూషతో కలిసి మాంచో ఫెర్రర్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి అధునాతన వసతులతో స్టేడియం నిర్మించడం శుభపరిణామమన్నారు. క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సత్తా చాటాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి, మాజీ అధ్యక్షుడు పగడాల మల్లికార్జున, రంజీ మాజీ క్రికెటర్లు ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి, షాబుద్దీన్, ఫయాజ్ అహ్మద్, సురేష్, షాషావలి, డీబీ ప్రశాంత్ కుమార్, శివరాజ్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.



క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న మాంచో ఫెర్రర్, అనూష

అనూషకు సత్కారం



అనూషకు చెక్కును అందజేస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన జిల్లాకు చెందిన తొలి క్రికెటర్ అనూషను జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ శనివారం సత్కరించారు. ఆర్డీటీ స్టేడియంలో అనూషకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు. అనూషను క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని మాంచో ఫెర్రర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకా ష్‌రెడ్డి, భీమలింగారెడ్డి పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16

అనంతపురం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16,500 పలికాయని మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి ధరరూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 556టన్నుల చీనీకాయలు వచ్చాయని తెలిపారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు జైలు శిక్ష

పామిడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి మహిళ మృతికి కారణమైన వ్యక్తికి గుత్తి జేఎఫ్‌సీఎం కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. రూ.2వేలు జరిమానా కూడా విధిస్తూ శనివారం తీర్పు వెలువరించింది. సీఐ యుగంధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2015లో పట్టణ సమీపాన జాతీయ రహదారిపై సయ్యద్ అబూబ్ కారు నిర్లక్ష్యంగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. అందులో ప్రయాణిస్తున్న లలితమ్మ తీవ్రంగా గాయపడి మరణించింది. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయాధికారి సయ్యద్ అబూబ్‌ను ముద్దాయిగా నిర్ధారిస్తూ ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలయాలను సందర్శించిన

తెలంగాణ అధికారులు


ఆలూరు కోనలో అధికారులు

తాడిపత్రి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు కోన, ఓబులేసు కోన, బెలుంగుహలు, హాజీవలి దర్గా తదితర ఆలయాలను శనివారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు సందర్శించారు. ఆయా ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను సందర్శించిన వారిలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఐఆర్ఎస్ అధికారి రామకృష్ణ, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా, అమరరాజా బ్యాటరీ సీఈఓ రమణ, జనరల్ మేనేజర్ గల్లా విజయ్‌నాయుడు, పారిశ్రామికవేత్త శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఆదివారం పట్టణంలోని ఏవీఆర్ ప్యారడైజ్‌లో 1976-79 కొడిగెనహళ్లి బ్యాచ్‌కు చెందిన వీరు గెట్ టుగెదర్ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్/రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ జట్లను శనివారం ఎంపిక చేశారు. అనంతపురం నగర పరిధిలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ సెలెక్షన్స్ నిర్వహించారు. స్కూల్ చైర్మన్ అనంతరాముడు పోటీలను ప్రారంభించారు. ఎంపికైన వారి వివరాలను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. స్విమ్మింగ్ అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగాల్లో మొత్తం 45మందిని, రైఫిల్ షూటింగ్ అండర్-17, 19 బాలబాలికల విభాగాలలో 60 మందిని ఎంపిక చేశారు. వారు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఈఓ నరసింహారావు, ప్రిన్సిపాల్ శాలిని, పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, పీఈటీలు నిరంజన్‌రెడ్డి, ఓబులేసు, సమీరా, రేఖ, లీలారాణి, ప్రత్యూష పాల్గొన్నారు.

జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా బదిలీ



గుంతకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఎస్పీ రాహుల్ మీనా బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆయనను బీఆర్‌అంబేడ్కర్ కోన సీమ జిల్లాకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

అనారోగ్యంతో బాలుడి మృతి

ఆస్పత్రి వద్ద తల్లిదండ్రుల ఆందోళన


కిరణ్ ఆసుపత్రి వద్ద బాలుడి తల్లిదండ్రులు

పావగడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కుందుర్పి మండలం వెంకటంపల్లికి చెందిన మూడు నెలల బాలుడు అనారోగ్యంతో మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యమే తమ కుమారుడి మృతి కారణమని తల్లిదండ్రులు మంజునాథ్, గీత, వారి బంధువులు ఆరోపించారు. పావగడ తాలూకా లింగదహళ్లిలోని కిరణ్ ఆస్పత్రి ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన మేరకు బాలుడికి మూడు రోజుల క్రితం నోటిలో పుండు ఏర్పడింది. దీంతో లింగదహళ్లిలోని డాక్టర్ కిరణ్ ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో శుక్రవారం రాత్రి మరోసారి అదే ఆస్పత్రికి తీసుకువచ్చారు. డాక్టర్ కిరణ్ మందులిచ్చి, చికిత్స చేశారు. కాసేపటికి బాలుడి నోటి నుంచి నురుగు రావడంతో పరిస్థితి విషమించిందని, మరో ఆస్పత్రికి తీసుకువెళ్లాలని డాక్టర్ సూచించారు. దీంతో తల్లిదండ్రులు బాలుడిని పావగడకు తీసుకువెళ్లారు. అప్పటికే పసివాడు ప్రాణాలు కోల్పోయాడు. తమ కుమారుడిని ముందుగానే వేరే ఆస్పత్రికి పంపించి ఉంటే బతికేవాడని తల్లిదండ్రులు అన్నారు. పరిస్థితి విషమించాక చేతులెత్తేశాడని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదని, క్లినిక్‌ను మూసివేయాలని బాలుడి తల్లిదండ్రులు, బంధువులు డిమాండ్ చేశారు.


వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించిన విద్యార్థినులు

గొప్ప మనసులు..!

అయినవారు పట్టించుకోలేదు.. ఆలనాపాలనా చూసుకోలేదు. వృద్ధుడిని రోడ్డున పడేశారు. అయ్యా.. అమ్మా.. అంటూ దారిన వెళ్లేవారిని యాచిస్తూ ఉన్నాడు.. తిండిలేక, నీరులేక.. నీరసించిపోయాడు. అందరూ చూస్తూ.. వెళ్తున్నారే తప్ప.. ఎవ్వరూ పట్టించుకోలేదు. చదువుకునే చిట్టి తల్లులు.. ఆ అభాగ్యుడి దీనస్థితిని చూసి, చలించిపోయారు. అన్నం పెట్టి, నీరు ఇచ్చారు.. కాళ్లకు పుండ్లు ఏర్పడి, పురుగులు పట్టడాన్ని గమనించి అయ్యో.. పాపం.. అనుకున్నారు. వెంటనే ఆటోలో ఆస్పత్రికి చేర్చారు. చికిత్స చేయించారు. పెద్దమనసు చాటుకున్న ఆ అమ్మాయిలు కల్యాణి, త్రివేణి, శిరీష, లతాశ్రీ. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాల ముందు కొన్ని రోజులుగా దీనస్థితిలో యాచిస్తున్న వృద్ధుడిని శనివారం సర్వజనాస్పత్రికి తరలించారు. అయిన వాళ్లే కాదనుకున్న ఆ అభాగ్యుడి పట్ల మానవత్వం చూపారు. గొప్ప మనసు చాటుకున్నారు. వారిని ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది అభినందించారు. వృద్ధుడిని వివరాలు ఆరాతీయగా.. తన పేరు సత్యనారాయణ అనీ, తనది బుక్కపట్నం అని చెప్పారు. కుటుంబ సభ్యుల వివరాలు మాత్రం వెల్లడించలేదు. తన పిల్లలకు ఎక్కడ చెడ్డపేరు వస్తుందోనని ఎంత అడిగినా వారి గురించి మాత్రం చెప్పలేదు. అదే తండ్రి మనసు.

- అనంతపురం విద్య, ఆంధ్రజ్యోతి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విడపనకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకముక్కల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అజ్మతుల్లా శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ సమాఖ్య అధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్-14, 17, 19, విభాగాల్లో కరకముక్కల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో ఏడో తరగతి విద్యార్థి హెచ్ అఖిల్, అండర్ 17లో పదో తరగతి చదువుతున్న సుజాత, అండర్ 19 విభాగంలో తొమ్మిదో తరగతికి చెందిన ఎం భానుప్రియ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. త్వరలోనే ఉరవకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. వారిని టీచర్లు అభినందించారు.

రొద్దం విద్యార్థులు..



విద్యార్థి వేదవ్యాస్‌ను అభినందిస్తున్న టీచర్లు

రొద్దం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొద్దం, తురకలాపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల బుక్కపట్నం డైట్ కళాశాలలో నిర్వహించిన కళా ఉత్సవ్ 2025 పోటీల్లో రొద్దం పాఠశాలలో 9వ తరగతి చదివే వేదవ్యాస్ సంగీత వాయిద్య పోటీల్లో ప్రతిభ చాటి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. అక్టోబరులో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. తురకలాపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన సాయి, ప్రణీత్ రాజ్, దీక్షిత్‌రెడ్డి సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రామకృష్ణ తెలిపారు. అక్టోబరు 4నుంచి విశాఖపట్నం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం లింగప్ప, టీచర్లు అభినందించారు.

డీఎస్సీ ఎంపిక జాబితా వచ్చేసిందోచ్..

● 773 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక
● మిగిలిపోయిన 34 పోస్టులు

అనంతపురం విద్య, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల ఎదురుచూపులకు తెరపడింది. ఎట్టకేలకు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఎస్సీ-2025 అర్హత అభ్యర్థులను రోస్టర్, మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారు. 15 రోజులుగా ఈ ప్రక్రియ అటు అధికారులు, ఇటు అభ్యర్థుల్లో ఉత్కంఠరేపుతూ వచ్చింది. చివరకు ఎంపిక జాబితాను సిద్ధం చేసి, జిల్లా కమిటీ ఆమోదం కోసం రాష్ట్రశాఖ పంపించింది. జిల్లాలో 807 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు 45వేల మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 773 పోస్టులకు మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేశారు. వెరిఫికేషన్‌కు 776 మంది జాబితా రాగా.. ముగ్గురు అభ్యర్థుల సర్టిఫికెట్లు సరిగా లేకపోవడంతో తిరస్కరించారు. ఇక మిగిలిన 34 పోస్టులకు అభ్యర్థులు లేక మిగిలిపోయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇవి కూడా ఉర్దూమీడియం, బ్యాక్‌లాగ్ పోస్టులు అని అంటున్నారు. ఎంపిక జాబితాకు జిల్లా సెలెక్షన్ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అందులో భాగంగా రాష్ట్రశాఖ శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబుకు జాబితాను పంపించింది. తొలుత జిల్లా కార్యాలయంలో మరోసారి పరిశీలన చేయించారు. రోస్టర్ మేరకు ఏయే సబ్జెక్టుల్లో ఎన్ని పోస్టులు ఉన్నాయి, ఆ మేరకు ఉన్నాయా.. లేదా.. అని సరిచూశారు. అనంతరం జాబితాకు ఆమోదం వేయించుకోవడానికి నూతన కలెక్టరు ఆనంద్ వద్దకు డీఈఓ ప్రసాద్ బాబు శనివారం రాత్రి తీసుకెళ్లారు. అక్కడ సంబంధిత శాఖాధికారులతో నూతన కలెక్టర్ పక్కాగా పరిశీలించి వివరాలు ఆరా తీసిన తర్వాత జాబితాకు ఆమోదం వేసినట్లు సమాచారం. మొత్తంమీద జిల్లా డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక జాబితా ఓకే అయింది. 15న అధికారికంగా ప్రకటించనున్నారు. ఆ తర్వాత అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు.

భాస్కర్‌రెడ్డి మృతికి 'వైకుంఠం' సంతాపం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతికి అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి శనివారం ప్రకటనలో సంతాపం తెలిపారు. భాస్కర్‌రెడ్డి రాజకీయాలతో సంబంధం లేకుండా అందరితో స్నేహభావంతో మెలిగేవారన్నారు. తాను చాలా ఏళ్లు స్నేహపూర్వకంగా మెలిగానన్నారు. ఆయన దూరం కావడం బాధాకరమని పేర్కొన్నారు.

మాజీ మంత్రి శైలజనాథ్‌కు అస్వస్థత

శింగనమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ శింగనమల నియోజకవర్గం సమన్వయ కర్త సాకే శైలజనాథ్ అస్వస్థతకు గురయ్యారు. వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శైలజనాథ్ తొందరగా కోలుకోవాలని పార్టీ కార్యకర్తలు, నాయకులు కోరుకుంటున్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

రామ్ జెత్మలాని (జయంతి)



దేశంలో పేరొందిన ప్రముఖ న్యాయవాది, రాజకీయ నాయకుడు రామ్ జెత్మలాని 1923 సెప్టెంబరు 14న సిఖర్‌పూర్‌లో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) జన్మించారు. క్రిమినల్ న్యాయవాదిగా పేరొందారు. ముఖ్యంగా సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ పద్ధతులు కోర్టులో అతడి సామర్థ్యాన్ని నిరూపించాయి. ఇండియన్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగాను, కేంద్ర న్యాయవ్యవహారాల శాఖ మంత్రిగాను వ్యవహరించారు. సుదీర్ఘకాలం రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఇండియా, పాక్ దేశాల మధ్య సంబంధాలు మెరుగుపరిచేందుకు పాటుపడ్డారు. మానవహక్కుల పరిరక్షణకుగాను 1977లో ప్రత్యేక అవార్డు పొందారు. చట్టాలపై అవగాహనకు పలు పుస్తకాలు రాశారు. 2019 సెప్టెంబరు 8న కన్నుమూశారు.

గరికపాటి నరసింహారావు (పుట్టినరోజు)



మహాసహస్రావధాని, ప్రవచన కిరీటి గరికపాటి నరసింహారావు 1958 సెప్టెంబరు 14న పశ్చిమ గోదావరి జిల్లా బోడపాడు అగ్రహారంలో జన్మించారు. తెలుగు రచయిత, ఉపన్యాసకుడు. దేశంలోనే కాక విదేశాల్లో కూడా అవధానాలు చేశారు. 8 అష్ట, శత, ద్విశత అవధానాలు, వందలాది అష్టావధానాలు చేసిన ఘనత ఆయనది. 1,116 పద్యాలు (5వేల పంక్తులు) కలిగిన స్వీయకావ్యం 'సాగరఘోష'ను 8గంటల్లో ఏకధాటిగా మహాధారణ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. సాహిత్య, ఆధ్యాత్మిక అంశాలపై అనర్గళంగా ప్రసంగాలు చేస్తూ సామాజిక చైతన్యం కల్పిస్తున్నారు. గురజాడ విశిష్ట పురస్కారం, ధారణా బ్రహ్మ రాక్షసుడు తదితర గౌరవాలు అందుకున్నారు. 2022 సంవత్సరంలో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

బూంగ్ జూన్-హో (పుట్టినరోజు)



దక్షిణ కొరియా దేశానికి చెందిన సినీ దర్శకుడు బూంగ్ జూన్-హో 1969 సెప్టెంబరు 14న జన్మించారు. రచయితగా, నిర్మాతగాను పేరొందారు. 21వ శతాబ్ధంలో తొలి 25 ఉత్తమ సినీ దర్శకులలో 13వ స్థానంలో నిలిచిన ఘనత ఆయనది. 2019లో రూపొందిన బ్లాక్ కామెడీ థ్రిల్లర్ 'పారసైట్' సినిమా ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, స్క్రీన్‌ప్లే, ఉత్తమ అంతర్జాతీయ చలనచిత్రంగా 'ఆస్కార్ అవార్డు' అందుకుంది. 2020లో టైమ్స్ 100మంది ప్రభావవంతులైనవారి జాబితాలో ఒకరిగా నిలిచారు.

మహనీయులను స్మరించుకోవాలి

▸▸ కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు చిన్నకైవారమయ్య

బాగేపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అట్టడుగు వర్గాలకు విద్య, హక్కులు, రిజర్వేషన్లు కల్పించేందుకు పోరాటం చేసిన వారి చిత్రాలను ఇళ్లలో ఉంచుకుని స్మరించుకోవాలని తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, పట్టుశాఖ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ చిన్నకైవారమయ్య అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో శనివారం మహా నాయక అంబేద్కర్‌సేన తాలూకా సమితి నూతన పదాధికారుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాబాసాహెబ్ అంబేద్కర్, సావిత్రిబాయి పులె, లెనిన్, కార్ల్‌మార్క్స్, స్వామి వివేకానంద, నారాయణగురు వంటి మహనీయుల చిత్రపటాలను ఇళ్లలో ఉంచి స్మరించుకోవాలన్నారు. మనువాదం, కులవ్యవస్థ అధికంగా కొనసాగిన కాలంలో సమాజంలో అస్పృశ్యత, మూఢనమ్మకాలు తొలగాలని ఎంతోమంది పోరాటం చేశారన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు, నిమ్నవర్గాలు సహా అందరికీ సమాన అవకాశాలు అందేలా బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రచించారన్నారు. అంబేద్కర్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు డీవీ నారా యణస్వామి అధ్యక్షతన నూతన పదాధికారులను ఎంపిక చేశారు. సంఘం తాలూకా అధ్యక్షుడిగా నారాయణస్వామి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా అరుణ్ కుమార్‌గా ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీఐ ప్రశాంత్‌వర్ధి, కరవే తాలూకా ఉపాధ్యక్షుడు జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.



తాలూకా పదాధికారులతో ప్రముఖులు

ఉపాధ్యాయులే మార్గదర్శకులు



ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రముఖులు

● హరిదాస విద్వాంసుడు అరళుమల్లిగె పార్థసారథి

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యం చేరేందుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని అందుకే బోధనలు, క్రమశిక్షణలు, నైతిక విలువలుకూడా విద్యార్థులకు నేర్పాల్సిన అవసరం ఉందని యోగా యూనివర్సిటీ ఆఫ్ అమెరికా కులపతి, అంతర్జాతీయ హరిదాస విద్వాంసులు అరళుమల్లిగె పార్థసారథి అభిప్రాయపడ్డారు. కృష్ణ గ్రూప్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉపా ధ్యాయ దినోత్సవం జరిగింది. సంస్థల చైర్మన్ రుక్మాంగదనాయుడు అధ్యక్షత వహించగా డైరెక్టర్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ కమలాసుగంధి తదితరులు పాల్గొన్నారు. పార్థసారథి మాట్లాడుతూ జ్ఞానానికి మరోపేరే ఉపాధ్యాయు లన్నారు. సదా నవ్వుతో, నమ్మకంతో సాధన వైపు విద్యార్థులను ఉపాధ్యా యులు తీసుకెళ్లాలన్నారు.

ధ్యాన సంస్కృతి పట్ల నమ్మకం విద్యార్థులను సమగ్రమైన మార్గంలో పయనించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయా లన్నారు. రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టులోనూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలు చేయాలని అదే వందశాతం ఫలితాలతోపాటు వారి భవిష్యత్తుకు మార్గదర్శనం కానుందన్నారు. పలువురు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సత్కరించారు.

సెప్సిస్‌పై చైతన్యంకోసం పోస్టల్ స్టాంపు విడుదల

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సెప్సిస్ అనేది శరీరంలో వైరస్ ద్వారా అవయవాల వైఫల్యం, మృతికి కారణమయ్యే ఓ ప్రమాదకరమైన జబ్బు. తక్షణ చికిత్సల ద్వారానే మనిషి కోలుకునేందుకు వీలుంటుంది. ప్రపంచ సెప్సిస్ డేను పురస్కరించుకుని శనివారం అయోనియోస్ ఫార్మా, బెంగళూరు జనరల్ పోస్టాఫీస్ సంయుక్తంగా ప్రత్యేక పోస్టల్‌స్టాంప్‌ను విడుదల చేశారు. బెంగళూరు గ్రామీణ ఎంపీ, పద్మశ్రీ మంజునాథ్ స్టాంప్‌ను లాంఛనంగా విడుదల చేశారు. డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేందుకు పోస్టల్‌స్టాంప్ ఓ మార్గదర్శకం కానుందన్నారు. 5 వాస్తవాలు - 5 కార్యాచరణలు సూచిస్తుందన్నారు. కర్ణాటక డివిజన్ పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ తార, హెడ్ పోస్టమాస్టర్ హెచ్‌ఎం మంగేశ్, మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ మెడికల్ డైరెక్టర్ మురళి శ్రీనివాసన్, రాజీవ్‌గాంధీ చెస్ట్ హాస్పిటల్ డైరెక్టర్ శశిభూషణ్, జైన్ హాస్పిటల్ ఐసీయూ నిపుణుడు ఫరూక్ ఉల్లా ఖాన్, మణిపాల్ డాక్టర్ ప్రదీప్‌రంగప్ప, అయోనియోస్ ఫార్మా సీఎండీ ఎస్‌కే రాజాలు పాల్గొన్నారు.



స్టాంపు విడుదల చేస్తున్న పద్మశ్రీ డాక్టర్ మంజునాథ్ తదితరులు

వర్తమాన అంశాలతో జ్ఞాన సముపార్జన

● డీఎస్పీ ఎల్‌వై రాజేశ్

దొమ్మసంద్ర, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిరోజూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే వర్తమాన అంశాలపై స్నేహితులతో చర్చించడం ద్వారా జ్ఞాన సముపార్జన పెరుగుతుందని డీఎస్పీ ఎల్‌వై రాజేశ్ అభిప్రాయపడ్డారు. సర్జాపుర పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరనలో రాజ లాంఛనయుక్తి సంస్థానం, దుర్గా ఫౌండేషన్, కర్తవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలకు ఆరోగ్య, స్వచ్ఛతా కిట్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనూ ఉపాధ్యాయులు అనుభవజ్ఞులైనవారు ఉన్నారన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. బాలికలు సైతం యోగా, వ్యాయామంతోపాటు ఆత్మరక్షణకోసం కరాటే వంటివి నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. కర్తవ్య ఫౌండేషన్ సంస్థాపకులు జయశ్రీ, రాజలాంఛన యుక్తి సంస్థానం సర్జాపుర విభాగం అధ్యక్షుడు వినయ్ దండగి, కోర్‌కమిటీ కార్యదర్శి ఖాన్, సభ్యులు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కిట్లతో విద్యార్థినులు

రూ.3.5 లక్షలు పలికిన గణేశ లడ్డూ

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దేవరచిక్కనహళ్ళి మునీశ్వర లే అవుట్‌లో యువజనసంఘం ఆధ్వర్యంలో గణేశ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శనివారం లడ్డూను వేలం వేయగా రూ.3.5లక్షలు పలికింది. వీఆర్ గ్రూప్ అధినేత కృష్ణమూర్తి వేలంపాటలో లడ్డూను దక్కించుకున్నారు. సదరు లడ్డూను తిరిగి భక్తులకు పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమం అనంతరం వేలంపాట నిర్వహించారు. బొమ్మనహళ్ళి కేపీ రాజా యువజనమండలి అధినేత ముఖేశ్‌నాయుడు పర్యవేక్షించారు. ముఖ్యులుగా ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు. లడ్డూవేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఖర్చు చేయనున్నట్టు ముఖేశ్ తెలిపారు. గణేశ ఉత్సవాలలో భాగంగా 3వేలమందికి పైగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.



వేలంపాటలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు



ఫ్యాషన్ షోలో యువతి

వైశ్య క్రౌన్ పేరిట పురస్కారాలు

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ది వైశ్య క్రౌన్ 2025 పేరిట మిస్, మిసెస్ వైశ్య పురస్కారాలను ప్రదానం చేశారు. కర్ణాటకలో తొలిసారి వైశ్య సామాజికవర్గానికి చెందిన వారి మధ్య శనివారం పోటీలు జరిగాయి. ఇక్కడ గెలిచినవారు హైదరాబాద్‌లో జరిగే గ్రాండ్ ఫినాలెలో పాల్గొంటారు. 18ఏళ్ల లోపు వారు మిస్ వైశ్య, పైబడినవారు మిసెస్ వైశ్య పేరిట రెండు విభాగాలలో పోటీలు జరిగాయి. సిందూరి ఉప్పల, అమ్మనబోలు, శివకుమార్ ఎమ్మడిలు పర్యవేక్షించారు. సిందూరి హ్యాష్‌ట్యాగ్ ఇండియా మ్యాగజైన్ వ్యవస్థాపకులు.

విద్యారంగంలో మౌలానా సేవలు చిరస్మరణీయం

● ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్

రాయచూరు సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మనదేశంలో విద్య వ్యాప్తి కోసం మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవా కృషి మరవలేనివని ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి, విధాన పరిషత్ సభ్యుడు నసీర్ అహ్మద్ అన్నారు. సహారా ఎడ్యుకేషనల్ అండ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రంగమందిరంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినాచరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని నసీర్ అహ్మద్ మాట్లాడారు. విద్యరంగంలో వినూత్నమైన మార్పులతో పాటు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వంటి ప్రతిష్టాత్మకమైన విద్య సంస్థలను నెలకొల్పడంలో మౌలానా చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. నేటి తరం విద్యాశాఖ మంత్రులకు ఆయన తీసుకున్న నిర్ణయాలు చేసిన కృషి ఆదర్శంగా నిలిచాయన్నారు. కాగా రాష్ట్రంలో అనేక విదేశి విద్య సంస్థలు ప్రవేశిస్తున్న నేపథ్యంలో విద్యావ్యాప్తికి మరిన్ని మెరుగైన అవకాశాలు అందనున్నాయన్నారు. యూనివర్సిటీ ఆఫ్ స్ట్రేలియా వంటి విద్య సంస్థలు రాష్ట్రంలోకి రానున్న నేపథ్యంలో ఈ అవకాశాలను రాష్ట్ర విద్యవంతులు విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నసీర్ అహ్మద్

లక్షల రూపాయల మోసం

● నిందితుల అరెస్టు



పట్టుబడిన నిందితులు

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కి చెందిన దిర్హామ్ కరెన్సీని చూపి మనదేశ కరెన్సీలో లక్షలాది రూపాయల వంచనకు పాల్పడిన వారిని దొడ్డబళ్ళాపుర రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. షేక్ సల్మాబాను (35), మొహ్మద్ మిల్లన్ (32)లను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు పారిపోయినట్టు తెలుస్తోంది. చిక్కబళ్ళాపురకు చెందిన టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వహిస్తున్న అల్లాబక్ష్ అనే వ్యక్తికి యూఏఈ దేశ కరెన్సీ దిర్హాంలు చూపి రూ.6లక్షలకు పైగా మోసం చేశారు. 100 దిర్హాంల నోటు చూపి ఇటువంటివి తన వద్ద మరిన్ని ఉన్నాయని, అవసరం కోసం తక్కువ రేటుకే ఇస్తానని ఆగస్టు 23న చిక్కబళ్ళాపుర నుంచి దొడ్డబళ్ళాపురలోని బాశెట్టి హళ్ళికి పిలిపించి నమ్మించారు. మరుసటిరోజు 24న ఉదయం 8 గంటలకు అల్లాబక్ష్ రూ.6లక్షల నగదును తీసుకెళ్లి నిందితులకు ఇస్తారు. దిర్హాంల కరెన్సీ ఉన్న బ్యాగును అల్లాబక్ష్‌కు ఇచ్చి నిందితులు వెళ్లిపోతారు. తర్వాత బ్యాగులోని కరెన్సీని పరిశీలించగా పైన మాత్రం నోట్లు పెట్టి కింద అంతా తెల్లకాగితాలు ఉన్నట్టు గుర్తిస్తాడు. బాధితుడు వెంటనే దొడ్డబళ్ళాపుర రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తాడు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాదిక్ పాషా నేతృత్వంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తారు. ఆరోపితులలో ఇద్దరిని అరెస్టు చేశారు. మరోవ్యక్తికోసం గాలింపు చేపట్టారు.

ఆటో.. బస్సు ఢీ ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద 44వ జాతీయరహదారిపై ఆటోను వోల్వోబస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ నాగరాజు ప్యాసింజర్ లక్ష్మీని ఎక్కించుకుని సోమందేపల్లి నుంచి పెనుకొండ వైపు వస్తున్నాడు. పులేకమ్మ ఆలయం వద్దకు రాగానే వెనుక నుంచి వోల్వో బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

కళాశాలకు ప్రహరీ ఏర్పాటు

దొమ్మసంద్ర, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామం హౌసింగ్‌బోర్డులోని ప్రభుత్వ స్వాతంత్ర్య పీయూ కళాశాల, అంగన్‌వాడీ ఆవరణలో తాగుబోతుల బెడద అధికమైంది. ప్రహరీ లేకపోవడంతో సమస్య నెలకొంది. కళాశాల ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారకూడదనే ఉద్దేశ్యంతో దళిత సంఘర్షణ సమితి చొరవ చూపింది. దొమ్మసంద్ర మునిరాజు నేతృత్వంలో కళాశాలకు ఇనుపకమ్మీని కంచెగా అమర్చారు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో రూ.15లక్షల విలువైన ఇనుప కమ్మీని కంచెగా వేయడం ద్వారా రూ.210కోట్ల విలువైన భూమిని కాపాడినట్టు అయ్యిందని మునిరాజు తెలిపారు. పాఠశాల, కళాశాల సమీపంలో వైన్‌షాప్‌లు ఉండరాదనే నిబంధన ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. కళాశాలకు 10 మీటర్ల దూరంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అణకహళ్ళి కృష్ణప్ప, మారుతి నాయక్, సీ మునిరాజు, హళిమావు ఆనంద, విజి ప్రకాశ్, కూడ్లు చంద్రప్ప, గోపసంద్ర రమేశ్, ఉమేశ్, మంజుళమ్మ, కెంపమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూడున్నర లక్షల కుటుంబాలకు నందఘర్ సాయం

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వేదాంత ప్రముఖ సమాజసేవా విభాగం నందఘర్ 15 రాష్ట్రాలలోని మూడున్నర లక్షల కుటుంబాలకు సాయం అందించేందుకు స్త్రీ శిశుసంక్షేమశాఖ సహకారంతో పోషణ మాసం 2025 నిర్వహిస్తున్నట్టు సీఈఓ శశి అరోరా తెలిపారు. పోషణతో ప్రగతి అనే నినాదంతో కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు బెంగళూరులో ప్రకటించారు. దేశవ్యాప్తంగా నందఘర్ పోషణాకేంద్రాలుగా మార్పు చెందనున్నాయన్నారు. స్థానికంగా లభ్యమయ్యే తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం సమకూర్చేందుకు కుటుంబాలకు సాయం చేయదలిచామన్నారు. ఆహార పద్ధతి, తల్లి ఆరోగ్యం, పిల్లల ఎదుగుదలకు ప్రత్యేక శిక్షణలు ఇవ్వదలిచామన్నారు. పోషణతోపాటు శిక్షణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలకు పౌష్టికాహారం సమకూర్చేందుకు న్యూట్రిషన్‌బార్, ప్రొటీన్‌షేక్‌లు అందిస్తా మన్నారు. శిక్షణల ద్వారా మహిళాశక్తిని పెంపొందింప చేయదలిచామన్నారు. ఆధునిక పరికరాలను సద్వినియోగం చేసుకునే విధానంపై చైతన్యం కలిగిస్తామన్నారు. నందఘర్ పథకంలో అంగన్‌వాడీలను ఆధునిక సమాజ అభివృద్ధి కేంద్రాలుగా మార్పు చేయడమే ఆశయమన్నారు.

గ్లోబల్ బిజినెస్ టెక్నాలజీకి భారత్‌లో కోడింగ్ రూపకల్పన

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ డిజిటల్ రంగం రూపాంతరం చెందుతోందని గ్లోబల్ బిజినెస్ భవిష్యత్తును రూపొందించే అనేకమైన పరికల్పనలు, టెక్నాలజీలకు భారత్‌లో కోడింగ్ రూపొందిస్తున్నారని ఏపీ మెల్లర్ - మెర్క్స్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ నవనీత్ కపూర్ అభిప్రాయపడ్డారు. కోడ్ కార్గో 2025 సమగ్ర లాజిస్టిక్స్ కంపెనీ ఏపీ మెల్లర్-మెర్క్స్ బెంగళూరులో ఏర్పడిన ప్రముఖ సాంకేతిక కంపెనీగా అభిప్రాయపడ్డారు. కోడ్ కార్గో ప్రదర్శనలో స్టార్ కనెక్ట్, ఏఐ సాంకేతిక ఫ్లీల్ ఎనర్జీ ఎఫిషియన్సీ ప్లాట్‌ఫాం, 2.5 బిలియన్ ఐఓటీ డేటా పాయింట్లను సంస్కరి స్తుందన్నారు. ఎడ్జ్‌లో మిషన్ లర్నింగ్ మోడల్‌ను ఉపయోగించుకునే ప్లాట్‌ఫాం అన్నారు. బెంగళూరులోని టెక్నాలజీ సెంటర్ ద్వారా 130 దేశాలలో విద్యుత్ సరఫరా చెయిన్ లింకులు కలిగి ఉందన్నారు. 20వేలకుపైగా భారతీయులను కంపెనీ నియమించుకుందన్నారు. బెంగళూరు, ముంబై, పూనె, చెన్నైలలోని మార్క్స్ కార్యాలయాలలో 2900మంది సాంకేతిక నిపుణులు ఉన్నారన్నారు. సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రేషంసాహితోపాటు పలువురు పాల్గొన్నారు.

కచ్చితమైన మార్కెట్ విలువలే లక్ష్యం

● బిగ్రూ వ్యవస్థాపక సీఈఓ శ్రీరాజ్ రెడ్డి

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఖచ్చితమైన మార్కెట్ విలువలు మా లక్ష్యమని రియల్ ఎస్టేట్ బూం చూపి మోసం చేయాలనేది మా ఆశయం కాదని బిగ్రూ సంస్థ వ్యవస్థాపక సీఈఓ శ్రీరాజ్‌రెడ్డి అభి ప్రాయపడ్డారు. నగరంలో జరిగిన సదస్సుల్ రియల్‌టైం రిపోర్టింగ్, ఏఐ ఆధారిత సర్దుబాట్లు అనే అంశంపై ఆయన మాట్లాడారు. 'ద డెడ్ లీడ్స్ స్మశానవాటిక' పేరుతో వినూత్నంగా ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. పెట్టుబడులు వృథా కానివ్వకుండా ఆస్తి విలువ మార్కెట్‌లో ఖచ్చితమైన మదింపు చేస్తామన్నారు. డేటా గోప్యత, భద్రత, నమ్మకం మా లక్ష్యమన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

● పంచాయతీ సభ్యుడు ఆనంద్



వేదికపై పంచాయతీ సభ్యులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళమాచనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని బసవాపట్టణలో గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మళమాచనహళ్ళి గ్రామపంచాయతీ సభ్యుడు ఆనంద్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్‌భారత్ పథకంలో భాగంగా శిబిరం ఏర్పాటైందన్నారు. రాష్ట్రంలోని చిక్కమగళూరు, చిక్కబళ్ళాపుర జిల్లాల్లో మాత్రమే ఇలాంటి ఆరోగ్య శిబిరాలు సాగుతున్నాయన్నారు. ఈ రెండు జిల్లాల్లో ప్రతి తాలూకాకు ఒక గ్రామం ఎంపికైందన్నారు. శిడ్లఘట్ట తాలూకాలో బసవాపట్టణ గ్రామం ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. తాలూకా పాలనా వైద్యాధికారి వెంకటేశ్ మూర్తి మాట్లాడుతూ గ్రామంలోని పదేళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే తగిన చికిత్సలు పొందవచ్చునన్నారు. పీడీఓ శైల మాట్లాడుతూ పదిరోజులపాటు శిబిరం కొన సాగుతుందన్నారు. మేలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రమేశ్, గ్రామపంచాయతీ కార్యదర్శి తిమ్మేగౌడ, ఆరోగ్యశాఖ డాక్టర్ గణేశ్, నిహారిక, మనోజ్, దర్శ, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,631.88
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	13.687	25,671
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13,533	24,228
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.38



బోనులో ఎలుగుబంటి

బోనులో చిక్కిన ఎలుగుబంటి

బళ్లారి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పొలాల్లో తిరుగుతూ రైతులను బెంబేలెత్తించిన ఎలుగుబంటి ఎట్టకేలకు బోనులో చిక్కింది. హోస్పేట్ సమీపంలోని కారిగనూరు-మలపనగుడి గ్రామాల మధ్యలో ఉన్న గొండలిపుర తిమ్మప్పనగుడి వద్ద శుక్రవారం సాయంత్రం అటవీశాఖ సిబ్బంది ఎలుగుబంటిని బోనులో బందించారు. చాలా రోజులుగా ఈ ప్రాంతంలో ఎలుగుబంటి సంచరిస్తోంది. దీన్ని జాడ గమనించిన గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. బోనును ఏర్పాటు చేసిన అధికారులు బోనులో బెల్లం ఉంచి వల పన్నారు. ముందు రోజు బెల్లం తిన్న ఎలుగుబంటి వెనక్కి వెళ్లిపోయింది. రెండో రోజు బెల్లం కోసం వచ్చిన ఎలుగుబంటి బోనులో చిక్కుకుంది. ఎలుగుబంటిని గదగ్ జూకు తరలించినట్లు అటవీశాఖ అధికారి తెలిపారు. ఎలుగుబంటి పట్టుబడడంతో గ్రామస్థఉ ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

బళ్లారి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గం పట్టణంలో విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వినాయక శోభా యాత్ర శనివారం అత్యంత ఘనంగా జరిగింది. శోభా యాత్రలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. జైగణేశా..గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలతో పురవీదుల్లో శోభాయాత్ర ఘనంగా సాగింది. నిమజ్జనం రాత్రి వరకు కొనసాగింది.

గుండెపోటుతో రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



హబీబ్ (ఫైల్)

బళ్లారిరూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని కె. వీరాపురం గ్రామంలో రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయుడు హబీబ్ శుక్రవారం రాత్రి గుండె పోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రధాన ఉపాధ్యాయుడుగా కురుగోడులో దాదాపు 15 సంవత్సరాలు పనిచేసిన ఆయన, కే వీరాపురం గ్రామంలోనూ హెచ్‌ఎంగా పని చేసి 2023లో రిటైర్డ్ అయ్యారు. ఆయన మృతి పట్ల పోలవరం కాలేజీ అధ్యాపకులు, పలువురు ప్రభుత్వ సీనియర్ ఉన్నతాధికారులు సంతాపం తెలిపారు.

రేపు ప్రజాస్వామ్య దినోత్సవం

హోస్పేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాపరిపాలన, జిల్లా పంచాయతీ, సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హోస్పేట నగరంలోని జిల్లా ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ జెండాను ఎగురవేస్తారు. మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప, హోస్పేట ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప అధ్యక్షత వహిస్తారు. ఎంపీలు ఈ తుకారాం, డాక్టర్ ప్రభా మల్లికార్జున, హగరిబొమ్మనహళ్లి ఎమ్మెల్యే కే నేమిరాజ్‌నాయక్, కుడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌టీ శ్రీనివాస్,హరాన హడగలి ఎమ్మెల్యే కృష్ణానాయక్,పలువురు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, కమిషనర్లు పాల్గొంటారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు

● పలు ప్రాంతాల్లో నేలకొరిగిన వరి ● తెగుళ్లతో తగ్గనున్న దిగుబడి: అన్నదాత ఆవేదన



కుళ్లిన మొక్కజొన్న కంకులను చూపుతున్న రైతులు

కంప్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలతో తాలుకాలోని తుళహళ్లితో సహా అనేక గ్రామాల్లో రైతులు పంటలు నీటలో మునిగి పంటలు పూర్తిగా నష్టపోయాయి. మొక్కజొన్న, ఉల్లిపాయలు సహా అనేక పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట నీటి పాలు అవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా ఎదురుకావడంతో కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కొట్టూరు తాలుకాలో రైతులు తమపొలాల్లో నష్టపోయిన పంటలను చూపుతూ మొక్కలు బాగా దెబ్బ తిన్నాయని, పంట చేతొకొచ్చేది కష్టమేనని వాపోయారు. ఏభుత్వం ప్రతి గ్రామంలో సర్వేలు చేపట్టి నష్టపోయిన పంటలకు నష్టపరిహారం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు తిమ్మప్ప మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మొక్కజొన్న, ఉల్లి, సజ్జ, పెసరు తదితర పంటలు వర్షం కారణంగా పర్తిగా నీటిలో మునిగి నష్టం వాటిల్లిందని తెలిపారు. వెంటనే ఆ రైతులని ఆదుకుని నష్టపరిహారం కల్పించాలని కోరారు. అలాగే కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం గ్రామం వద్ద వర్షాలకు పంటలు నేలకొరవడటంతో నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చేస్తున్నారు. ఈ సందర్భంగా శరణప్ప మాట్లాడుతూ పంటల దిగుబడి వచ్చే సమయంలోనే ఇలా భారీ వర్షాలు కురవడంతో పంటలు పూర్తిగా నేలపాలయ్యాయని తెలిపారు.



నేలకొరిగిన వరిని చూపుతున్న శరణప్ప

రోడ్డు పనులకు మోక్షమెన్నడో..?



నిలిచిపోయిన హోస్పేట బైపాస్ రోడ్డు పనులు

కంప్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కంప్లి నుండి హోస్పేట్ వెళ్లే రోడ్డు మార్గంలో మినీ విధాన సభ ముందు భాగం నుంచి తిమ్మాపురం వెళ్లే క్రాస్ వరకు రోడ్డు పనులు త్వరగా ముగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు పనులు ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇంతవరకు పనులు పూర్తికాక రాత్రివేళల్లో ఎన్నో సార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగుతూ సాగుతూ జరుగుతున్న వేగవంతం చేపట్టి పనులు పూర్తి చేయాలని కోరారు.

రోడ్లు బాగు చేయండి..



గుంతలమయమైన ప్రధాన రహదారి

తోరణగల్లు(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బ తిన్నాయని, మరమ్మతులు చేపట్టాలని స్థానికులు వాపోతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రహదారి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

సిరుగుప్ప, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రహదారి పనులకు ఎమ్మెల్యే బీఎం నాగజారు శనివారం భూమిపూజలు చేశారు. రూ.3.20 కోట్ల వ్యయంతో సరిహద్దు ప్రాంతంలో రహదారి అభివృద్ధి చేపట్టనున్నారు. సిరుగుప్ప తాలుకా పరిధిలో కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో బండ్రాల్ నుంచి రారావి గ్రామం వరకు మరమ్మతులు చేయనున్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పీడబ్ల్యూడీ ఏఈఈ చందనగౌడ, నగర సభ కౌన్సిలర్లు, బీఎం అప్పాజీ నాయక, గణేష్, గ్రామ పంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ



లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా న్యాయాధికారి మారుతి బగాడె



రాజీ అయిన కక్షిదారులు

రాయచూరు సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : రాజీ ద్వార పరిష్కరించగలిగే కేసుల కోసం ఏర్పాటు చేస్తున్న లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి, న్యాయసేవా ప్రాధికార అధ్యక్షుడు మారుతి బగాడె అన్నారు. శనివారం నగరంలోని జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా న్యాయమూర్తి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో లోక్ అదాలత్ ద్వార పరిష్కరించే అవకాశం ఉన్న కేసులు 25 వేలకు పైగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిని శనివారం మూడవ జాతీయ లోక్ అదాలత్‌లో 2,500 కేసులను తీసుకోగా అందులో 1500 కేసులను పరిష్కరించామన్నారు. వీటిలో ఆస్తి తగాదాలతో పాటు ఆర్థిక లావాదేవిలకు సంబంధించిన కేసులు సహితం ఉన్నాయన్నారు. ఆస్తి పంపకాలకు సంబందించి బంధువుల మధ్య తలెత్తిన వివాదాలను సహితం చర్చల ద్వార పరిష్కరించినట్లు న్యాయమూర్తి వివరించారు. కాగా న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో చేపట్టిన లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గరిష్ఠ ధరల నిర్ణయంతోనే రైతులకు మేలు

● చైర్మన్ డాక్టర్ అశోక్ దళవాయి



మొక్కకు నీరుపోసి సభను ప్రారంభిస్తున్న అశోక్ దళవాయి

రాయచూరు సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులకు కనిష్ఠ ధరలంటే గరిష్ఠ ధరలు అందించడమే రైతులకు మేలు చేకూరుస్తుందని కర్ణాటక రాష్ట్ర పంట ఉత్పత్తుల ధర స్థిరీకరణ కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ దళవాయి అన్నారు. ధరల స్థిరీకరణకు సంబంధించి శనివారం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో రైతు సంఘాల ప్రతినిధులు, రైతు ప్రముఖులు వివిధ సంఘాలతో సమాలోచన సభ నిర్వహించారు. సభలో మాట్లాడిన డాక్టర్ అశోక్ దళవాయి, సాగు వ్యయం ఉత్పత్తుల పై చూపుతున్న వాతావరణ ప్రభావం, రైతులకు జరుగుతున్న నష్టం, ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రోత్సహంతో పాటు పంట ఉత్పత్తులకు శాస్త్రీయ పద్ధతిలో ధరలు నిర్ణయించడం అనివార్యమన్నారు. ఈ విషయంలో కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వాల కంటే రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడమే సత్ఫలితాన్ని ఇస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తన వంతు ప్రయత్నం ప్రారంభించిందని అందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని చోట్ల రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో కలిసి సమాలోచనలు జరిపేందుకు నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే కల్యాణ-కర్ణాటక ప్రాంతానికి చెందిన రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

చలో సూర్యపేటకు రామమూర్తిస్వామి

పావగడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ రాష్ట్రం సూర్యపేట జిల్లాలో బాలాజీ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి పావగడ నుంచి సర్వధర్మ శాంతి పీఠం అధ్యక్షుడు రామమూర్తి స్వామీజీ వెళుతున్నారు. ఆదివారం ఉదయం జరిగే కార్యక్రమానికి నాగ సాధువులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, అఘోరాలు, హిందూ సంఘ సంస్థలు పాల్గొంటున్నట్లు సనాతన ధర్మ సంరక్షణ సమితి అధ్యక్షుడు భైవరవేశ్వరానంద స్వామి తెలిపారు.



స్వామీజీని ఆహ్వానిస్తున్న భైరవేశ్వరానందస్వామి



కలెక్టర్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్

కలెక్టర్‌తో కాంగ్రెస్ నేతల భేటీ

బళ్లారి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగేంద్ర ప్రసాద్‌ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ తదితరులు భేటీ అయ్యారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ వెంకటేష్ హెగ్డే, అలివేలు సురేష్, యర్రిస్వామి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సిరుగుప్ప, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కండక్టర్లు, డ్రైవర్లు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం అత్యవసరమని జిల్లా ఈశాన్య కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం సిరుగుప్ప పట్టణం, ఆర్టీసీ డిపోలో కండక్టర్, డ్రైవర్లు, సిబ్బందికి ఆరోగ్య పరీక్ష శిబిర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ పనుల ఒత్తిడి వలన మనిషికి బీపీ, షుగర్ రావడం సర్వసాధారణమని, ఆరోగ్య పరీక్షలు చేసుకుంటే అదుపులో వుంచుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ వైద్యాధికారి మహమ్మద్ ఖాసీం అందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి డెంటల్ వైద్యులు పవన్ కుమార్ వర్మ, రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

గోపురాలకు రక్షణ కరువు



శిథిలావస్థకు చేరుకున్న గోపురాలు

కంప్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కనగిరిలో విజయనగర కాలం నాటి కనకా చలపతి ఆలయానికి చెందిన ఐదు భారీ గోపురాలు వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని రక్షించాలని భక్తులు పురావస్తు శాఖను డిమాండ్ చేశారు. ఉత్తర గోపురంలో పగుళ్లు కనిపిస్తున్నాయి. అధికారులు అడ్డంగా రాతి స్తంభాన్ని వుంచి చేతులు దులుపుకున్నారు. చాలా సంవత్సరాలుగా గోపురాల రక్షణ కోసం డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని భక్తులు ఆరోపించారు. ఇప్పటికైనా పురాతత్వశాఖ అధికారులు ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి గోపురాలకు రక్షణ కల్పించి గోపురాలు శిథిలావస్థ చేరకుండా చేపట్టాలని కోరారు.

ఇళ్ల ముందుకు మురుగునీరు



మురుగునీటిని చూపుతున్న గ్రామస్థులు

తోరణగల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా కురేకుప్ప పట్టణంలోని ఆరవ వార్డులోని శ్రీ మార్కండేయస్వామి దేవస్థానం సమీపంలో స్థానికులు మురుగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. కాలువ సమీప భాగాల్లో మట్టి పేరుకుపోవడంతో వాన నీరు నిలిచిపోయి ఇండ్ల వద్దకు పారుతోందని వాపోతున్నారు. నీరు నిలిచిపోయి దోమలు ప్రబలుతున్నాయని, జ్వరాలు వస్తున్నాయని వాపోతున్నారు. పురసభ అధికారులు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పురసభ సిబ్బంది వన్నూరు స్వామి, వార్డు మెంబర్ కుమారప్ప పాల్గొన్నారు.

ముగిసిన మారికాంబ దేవి జాతర



గ్రామ వీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కంప్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కూడ్లిగి తాలుకాలోని ఖానాహోసళ్లి గ్రామంలో మారికాంబ దేవి ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథం దగ్గర పూజలు చేసిన తరువాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు బయటి తోటలోని మారెమ్మకట్ట వరకు ఊరేగించారు. భక్తుల పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించి భక్తిని ప్రదర్శించారు. యేటా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటామని గ్రామస్థులు తెలిపారు. ఉత్సవాలు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని తెలిపారు.

హోసూరు జోన్



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

సీఎం పర్యటనపై డీఎంకే సమావేశం

హోసూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హోసూరు శాసనసభ నియోజకవర్గ డీఎంకే కార్యనిర్వాహకుల సమావేశం శనివారం జరిగింది. రైల్వేస్టేషన్ రోడ్డులోని మీరామహల్‌లో ఏర్పాటైన సమావేశానికి ఎమ్మెల్యే ప్రకాశ్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. కార్పొరేషన్ మేయర్ సత్య పార్టీ పదాధికారులను స్వాగతించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 11న కృష్ణగిరి జిల్లాను సీఎం సందర్శించారని, 14న కూడా ముఖ్యమంత్రి సందర్శిస్తారన్నారు. అందివాడి, ఇఎస్ఐ, రింగ్‌రోడ్డు, సీతారాం మేడు, సూలగిరి వంటి ప్రాంతాలలో సీఎంను స్వాగతించేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాల్నారు. అన్నాదురై 117వ జయంతిని ఘనంగా నిర్వహించదలిచినట్టు తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాలలో కార్యకర్తలు, పదాధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హోసూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐఈఎస్, ఎస్‌టీడీ కంట్రోల్ ప్రోగ్రామ్ కింద చెన్నైలో రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. హోసూరు ఆదియమాన్ ఇంజనీరింగ్ కళాశాల మూడో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని ప్రదీప పాల్గొని జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ఆరోగ్య మంత్రి సుబ్రమణియన్ కూడా విద్యార్థినిని ప్రశంసించి ప్రశంసా పత్రం అందచేశారు. శనివారం కళాశాల ఏర్పాటైన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్, డీన్ ధనశేఖరన్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఫాతిమా అభినందించారు.

చెరువులో కలుషిత వ్యర్థాలు.. చేపల మృతి

హోసూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సూలగిరి సమీపాన కామంతోటి పంచాయతీ పరిధిలోని పిల్లకొత్తూరు గ్రామంలోని చెరువులోకి కలుషిత వ్యర్థాలు చేరడంతో చేపలు మృతి చెందుతున్నాయి. ఒక్కసారిగా భారీ ప్రమాణంలో చేపలు మృతి చెందడంతో చెరువు నీరు సైతం దుర్వాసన వస్తోందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 8 కిలోల బరువైన చేపలు సైతం చనిపోయానన్నారు. ఒక ప్రైవేట్ గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలను చెరువులోకి నేరుగా వదులుతుండడమే కారణంగా తెలుస్తోంది. వ్యర్థాలను శుద్ధీకరణ చేయకుండా వదలరాదనే నిబంధన ఉన్నా పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



మృతి చెందిన చేపలను చూపుతున్న స్థానికులు

ఎయిర్‌పోర్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

రాయచూరు సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగర సమీపం యరమరస్ వద్ద కొత్తగా నిర్మిస్తున్న రాయచూరు ఎయిర్ పోర్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు, కాంట్రాక్టర్లు పనుల్లో వేగం పెంచాలని జిల్లాధికారి నితీశ్ సూచించారు. శనివారం విమానయానం నిర్మాణ పనులను మహానగర పాలిక కమిషనర్ జుబిన్ మొహపాత్రతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటికే పూర్తి చేసిన రెండోన్నర కీలోమీటర్‌ల రన్ వే పనుల్లో సీసీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు ప్యాసింజర్ టెర్మినల్ ఇతరత్ర పనుల్లో వేగం పెంచాలని ఉద్దేశిత నిర్మాణాలు నాణ్యత ప్రమాణాలతో ఉండేలా కాంట్రాక్టర్‌లు శ్రద్ధ తీసుకోవాలన్నారు.



పనులను పరిశీలిస్తున్న డీసీ నితీశ్